సాక్షి
వికారాబాద్
గురువారం । 4 । సెప్టెంబర్ । 2025



సిబ్బంది కొరత

తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత కారణంగా ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. 8లో▸



పరిహారం చెల్లించాలి

అధిక వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ నేతలు కోరారు. 8లో▸



యూరియా కోసం..

యూరియా అందకపోవడంతో యాలాల సొసైటీ కార్యాలయం వద్ద బుధవారం రైతులు ఆందోళనకు దిగారు. 9లో▸

రీజినల్ టెన్షన్

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌పై రైతుల్లో ఉత్కంఠ




ఇటీవల అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

- భూములు కోల్పోయే వారిలో ఆందోళన
- గత ప్రతిపాదనల్లో జిల్లా మొత్తంలో ఒకటి రెండు గ్రామాలకే పరిమితం
- తాజాగా 60 గ్రామాలపై ఎఫెక్ట్
- మా భూములు పోకుండా చూడాలని వేడుకుంటున్న అన్నదాతలు
- అడిషనల్ కలెక్టర్‌కు విన్నపాలు
- హెచ్‌ఎండీఏ కార్యాలయానికి తరలివెళ్లిన జిల్లా రైతులు

వికారాబాద్: జిల్లాలో ఎక్కడ చూసినా ఒక్కటే చర్చ జరుగుతోంది. రీజినల్ రింగ్ రోడ్డు కొత్త ప్రతిపాదనను ప్రభుత్వం రెండు రోజుల క్రితం వెబ్‌సైట్‌లో ఉంచిన విషయం తెలిసిందే. దీంతో ట్రిపుల్ ఆర్ జిల్లా మీదుగా దాదాపు ఖరారైంది. ఈ నేపథ్యంలో అన్నదాతల్లో చర్చ మొదలైంది. రియల్టర్లు, ప్రజాప్రతినిధుల నోట రీజినల్ మాటే వినిపిస్తోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ప్రతిపాదించిన గ్రామాలు, భూముల సర్వే నంబర్లు హల్‌చల్ చేస్తున్నాయి. గతంలో ప్రతిపాదించిన డీపీఆర్ ప్రకారం రీజినల్ రింగ్ రోడ్డు పడమర ప్రాంతంలో మన జిల్లాకు దిగువన రంగారెడ్డి జిల్లా సరిహద్దు ప్రాంతం నుంచి వెళ్లేలా తయారు చేశారు. వికారాబాద్ జిల్లాలోని ఒకటి, రెండు గ్రామాల పరిధిలోంచి మాత్రమే వెళ్లేది. తాజాగా మార్చిన అలైన్‌మెంట్‌తో జిల్లా పరిధిలోని సుమారు 60 గ్రామాల వరకు ట్రిపుల్ ఆర్ పరిధిలోకి రానున్నాయి. దీంతో ఎవరి భూములు పోతాయోననే ఆందోళన రైతుల్లో మొదలైంది. ఈ నేపథ్యంలో పలువురు రైతులు మంగళవారం అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) లింగ్యానాయక్‌ను కలిసి తమ భూముల మీదుగా ట్రిపుల్ ఆర్ వెళ్లకుండా చూడాలని వినతిపత్రం అందజేశారు. బుధవారం మరి కొంత మంది హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ కార్యాలయానికి వెళ్లి తమ అభ్యంతరాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. మాకు అన్యాయం జరగకుండా చూడాలని అధికారులను కోరారు. రైతుల అభ్యర్థనను ప్రభుత్వానికి పంపుతామని అడిషనల్ కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిసింది.

కొత్త ప్రతిపాదనతో..

ట్రిపుల్ ఆర్ జిల్లాను కలుపుతూ వెళ్లే పడమర భాగం అలైన్‌మెంట్ మారుస్తూ ప్రతిపాదించడంతో పాటు గ్రామాలు, సర్వే నంబర్లను కూడా వెల్లడించిన నేపథ్యంలో పొలాలు కోల్పోనున్న రైతులు అధికారులు, నేతల చుట్టూ తిరుగుతున్నారు. రీజినల్ రింగ్ రోడ్డు వెళితే తమ గ్రామానికి ఎటు వైపు నుంచి వెళ్తుంది..? ఎవరి పొలంలోంచి వెళ్తుంది..? అని చర్చించుకుంటున్నారు. తెలిసిన ప్రతి ఒక్కరినీ అడుగుతున్నారు. తమ గ్రామం మీదుగా వెళ్లాలి.. అభివృద్ధి జరగాలి.. కానీ మా పొలాల్లో పోకుంటే బాగుండు దేవుడా.. అంటూ వేడుకుంటున్నారు. జిల్లా వాసులందరూ రీజినల్ రింగురోడ్డు జిల్లా కేంద్రానికి దగ్గరగా వెళుతుండటంపై సంతోషం వ్యక్తం చేస్తుండగా పొలాలు కోల్పోనున్న రైతులు మాత్రం ఆందోళనకు గురవుతున్నారు.



రీజనల్ రింగ్‌రోడ్డు నూతన నమూనా

రియల్టర్ల హడావుడి

గతంలో తయారు చేసిన డీపీఆర్‌లో పొందుపర్చిన అలైన్‌మెంటులో పడమర ప్రాంతంలో మన జిల్లా సరిహద్దు ప్రాంతమైన రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఆలూరు – కొకుంట్ల గ్రామాల మధ్యలోంచి తంగెడుపల్లి మీదుగా వెళ్లేలా ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదనల్లో మన జిల్లాకు చెందిన పూడూరు, నవాబుపేట మండలాలకు చెందిన ఒకటి రెండు గ్రామాల రెవెన్యూ పరిధిలోంచి ట్రిపుల్ ఆర్ వెళ్లేలా డిజైన్ చేశారు. తాజాగా ప్రతిపాదనల్లో జిల్లాలోని నాలుగు మండలాలను కలుపుతూ రీజినల్ రింగ్ రోడ్డు వెళ్తుంది. పూడూరు, నవాబుపేట మండలాల పరిధిలోని 20 గ్రామాలకు పైగా ట్రిపుల్ ఆర్ పరిధిలోకి వస్తుండగా.. వికారాబాద్, మోమిన్‌పేట మండలాల పరిధిలోని ఐదారు గ్రామాలను కలుపుతూ కొత్త ప్రతిపాదనలు తయారు చేశారు. దీంతో ఈ ప్రాంతంపై రియల్టర్ల కన్ను పడింది. ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ అందుబాటులో ఉన్న సమాచారంతో ట్రిపుల్‌ఆర్ ఏయే గ్రామాలు, ఎటు వైపు నుంచి వెళ్తుందనే విషయాన్ని అంచనా వేస్తూ ఆయా ప్రాంతాల్లో భూములు కొనుగోళ్లకు యత్నిస్తున్నారు. కొన్ని చోట్ల అగ్రిమెంట్లు కూడా చేసుకుంటున్నారు.

ఎట్టకేలకు సర్వే

- రుద్రారం – నాగసమందర్ మార్గంలో కొత్త వంతెన
- తీరనున్న రవాణా కష్టాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రెండు గ్రామాల ప్రజలు



వంతెన నిర్మాణం కోసం సర్వే చేస్తున్న సిబ్బంది

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు పారిన ప్రతిసారీ రుద్రారం – నాగసమందర్ గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించిపోతాయి. అత్యవసర పరిస్థితుల్లో వాగు దాటేందుకు ప్రయత్నించే వారు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో నూతన వంతెన నిర్మాణానికి బుధవారం సర్వే పనులను ప్రారంభించారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాలతో సర్వే బృందం పర్యటించింది. వంతెన నిర్మాణం కోసం సర్వే చేశారు. 2016లో కురిసిన భారీ వర్షాలకు కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో రుద్రారం –నాగసమందర్ మార్గంలోని పురాతన వంతెన దెబ్బతింది. అప్పట్లో రూ.50 లక్షలు వెచ్చించి తాత్కాలిక మరమ్మతులు చేయించారు. 2018లో నూతన బ్రిడ్జి నిర్మాణానికి రూ.6.42 కోట్ల అంచనాలతో అప్పటి ఆర్ అండ్‌బీ శాఖ ప్రతిపాదనలు పంపింది. వివిధ కారణాల వల్ల దీన్ని పక్కన పెట్టారు. 800 మీటర్ల పొడవున వంతెన నిర్మించాల్సి ఉంటుంది. ఇందుకోసం దాదాపు రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. స్పీకర్ ప్రసాద్ కుమార్ రూ.20కోట్లు మంజూరు చేయాలని సంబంధిత అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ వంతెన అందుబాటులోకి వస్తే తాండూరు, కోట్‌పల్లి, బంటారం, మర్పల్లి మండలాలతో పాటు కర్ణాటక రాష్ట్రానికి రాకపోకలు సాగించడానికి ఎంతో మేలు జరుగుతుందని మంత్రి, ఈఎన్‌సీకి వివరించారు. ఈ క్రమంలో సర్వే పనులు ప్రారంభమైనట్లు తెలిసింది. వంతెన నిర్మించాల్సిన ప్రాంతంలో నీటి ప్రవాహం ఎలా ఉంది.. ఎంత వెడల్పు.. ఎంత దూరం వంటి వివరాలను సర్వే బృందం నమోదు చేసుకుంది.

6వ తేదీలోపు నిమజ్జనం పూర్తి చేయండి

ధూపదీప నైవేద్య అర్చక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రావు



దోమ: స్కంధ పురాణం ప్రకారం వినాయకుడి నిమజ్జనం సెప్టెంబర్ 6వ తేదీ(శనివారం)లోపు పూర్తి చేస్తే ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతుందని ధూపదీప నైవేద్య అర్చక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కరణం శ్రీకాంత్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందూ మత విశ్వాసాల ప్రకారం భాద్రపద శుద్ధ చవితి రోజున వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయాలన్నారు. ఆ రోజు కాకుండా మరికొన్ని రోజులు మండపాల్లో ఉంచితే పౌర్ణమి రోజులు వెంటాడతాయన్నారు. ఈ పౌర్ణమి రోజుల్లో పితృపక్షాలు మొదలై వినాయకుడికి శ్రేష్ఠం కలగదన్నారు. ఈ దినాలలో నిమజ్జనం చేయడం ద్వారా పాపాలు వెంటాడతాయన్నారు. అనంత చతుర్దశి రోజుకి పది రోజుల గణేశ్ చతుర్థి వేడుక ముగింపును సూచిస్తుంది. ఆ రోజున చేసిన నిమజ్జనం కేవలం విగ్రహాన్ని నిమజ్జనం చేయడమే కాకుండా మన దుఃఖాలు, కష్టాలన్నింటిని భగవంతుడు తీరుస్తాడని ప్రగాఢ నమ్మకం. గణపతి నిమజ్జనం భక్తిశ్రద్ధలతో ఆచారాలు, నియమాలతో చేయాలన్నారు. తద్వారా గణపతి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉంటాయని తెలిపారు. గడువు దాటితే అరిష్టాలు వస్తాయని పురాణాలు చెబుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

అన్ని విధాలా అభివృద్ధి

ఎస్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి కమలాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి

అనంతగిరి: పీఎం జన్‌మన్‌లో భాగంగా ఆది కర్మయోగి కార్యక్రమం కింద జిల్లాలో ఎంపికైన 13 మండలాల నుంచి 31 గిరిజన హాబిటేషన్లలో అన్ని రకాల అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి కమలాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం వికారాబాద్‌లోని తేజ ఫంక్షన్ హాల్‌లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 7 శాఖల సమన్వయంతో 91మంది ఆయా శాఖల్లో పనిచేసే ఉద్యోగులకు ఒకరోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపిక చేసిన గ్రామాల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనులను ప్రారంభించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్, డీఎంహెచ్‌ఓ లలితాకుమారి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వైద్యాధికారి లలితాదేవి



వైద్య సేవలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌ఓ లలితాదేవి

పూడూరు: ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యాధికారి లలితాదేవి సూచించారు. బుధవారం మండల పరిధిలోని చన్గోముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి డాక్టర్, సిబ్బందితో మాట్లాడారు. మందుల రికార్డులు పరిశీలించారు. రేబీస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉందా అని ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో పర్యటించే ఏఎన్‌ఎంలు విషజ్వరాలు, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యాధికారి మహమ్మద్ ఇక్బాల్ ఫారుకీ, సిబ్బంది షాహిదాబీ, రవికుమార్, సాజద్‌అలీ, దాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

అనంతగిరి: వికారాబాద్‌లో ప్రతిష్ఠించిన పలు వినాయకుడి విగ్రహాలను గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పూజలు చేసి తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆయన వెంట పలువురు నాయకులు, మండప నిర్వాహకులు ఉన్నారు.

58కిలోల లడ్డూ సమర్పణ



మొక్కు చెల్లించుకుంటున్న రాంబాబు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని శివరాం నగర్ కాలనీలో పార్థివాలా సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడికి ఓ భక్తుడు వినూత్న రూపంలో తన మొక్కును చెల్లించుకున్నాడు. కాలనీకి చెందిన రాంబాబు తన ఏకైక కుమారుడు కార్తీక్ బరువు ఎంత ఉంటే అన్ని కిలోల లడ్డూను సమర్పిస్తానని మొక్కుకున్నాడు. ఆయన కుమారుని బరువు 58 కిలోలు ఉండటంతో 58 కిలోల లడ్డూను ప్రసాదంగా సమర్పించారు.

నేటి అర్ధరాత్రి వరకే 'మహా' దర్శనం

ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహా వినాయకుడి దర్శనానికి గురువారం అర్ధరాత్రి వరకే అనుమతి ఉంటుందని, ఆ తర్వాత భక్తుల దర్శనాలను నిలిపివేస్తామని నిర్వాహకులు తెలిపారు. శనివారం మహా వినాయకుడి నిమజ్జనం సందర్భంగా షెడ్డు తొలగింపు పనులు, క్రేన్ ఏర్పాట్ల కారణంగా శీఘ్ర, సర్వదర్శనాలకు అవకాశం ఉండదు. భక్తులు ఈ విషయాన్ని గమనించి నిర్వాహకులకు, పోలీసులకు సహకరించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే

- పల్లెల్లో బీజేపీ బలపడుతోంది
- ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప

తాండూరు రూరల్: పల్లెల్లో రోజురోజుకూ బీజేపీ బలపడుతోందని ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప అన్నారు. బుధవారం తాండూరు మండలం గౌతాపూర్‌లో మండల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ గ్రామాన బీజేపీ తరఫున అభ్యర్థులను నిలపాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని పేర్కొన్నారు. పేదలు, రైతుల సంక్షేమం ప్రధాని మోదీ అనేక పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. అంతకుముందు చెంగోల్, సిగిరిపేట్ గ్రామాల్లో పర్యటించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పటేల్ విజయ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు శేఖాపురం అంజనేయులు, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, నాయకులు విజయ్‌కుమార్, చిరంజీవి, మల్లికార్జున్, మల్లేశం, సిద్దప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు

రంగారెడ్డి జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి సురేశ్



రైతులకు కొనుగోలు ఒప్పంద పత్రాలను అందిస్తున్న సురేశ్

ఆమనగల్లు: ఆయిల్‌పాం సాగుతో రైతులు అధిక లాభాలు పొందొచ్చని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి సురేశ్ అన్నారు. పంటను ప్రోత్సహించడానికి ప్రభుత్వం అనేక రాయితీలు కల్పిస్తోందని చెప్పారు. ఆకుతోటపల్లి గ్రామంలోని రైతువేదికలో బుధవారం జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్‌పాం సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆయిల్‌పాం సాగుకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మొక్కలకు 90 శాతం, డ్రిప్ ఇరిగేషన్‌కు 80 శాతం రాయితీ ఉందన్నారు. పంట సాగుచేసిన రైతులకు ఎకరానికి రూ.4,200 చొప్పున నాలుగేళ్లపాటు అందించడం జరుగుతుందని వివరించారు. జిల్లాలో ఆయిల్‌పాం సాగును ప్రోత్సహించడానికి వ్యాల్యూ ఆయిల్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుందని, సదరు కంపెనీ రైతుల నుంచి కొనుగోలు చేస్తుందని ఆయన వెల్లడించారు. పంటకు కోతుల బెడద ఉండదని, కూలీల అవసరం కూడా తక్కువగా ఉంటుందన్నారు. అనంతరం రైతులకు ఆయిల్‌కంపెనీతో కుదుర్చుకున్న కొనుగోలు ఒప్పంద పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి సౌమ్య, ఆయిల్ పాం ఏరియా మేనేజర్ ప్రమోద్, హెచ్‌ఈఓ శ్రవణ్‌కుమార్, ఏఈఓ భూదేవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి: గోపీచంద్

నందిగామ: విద్యార్థులు, యువత తమకు ఇష్టమైన క్రీడల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించి ప్రపంచ స్థాయిలో రాణించాలని బ్యాడ్మింటన్ నేషనల్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ ఆకాంక్షించారు. మండల పరిధిలోని కన్హా శాంతివనంలోని గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో బీఏటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోనెక్స్ సన్‌రైజ్ 79వ సౌత్ జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్–2025 రెండో రోజైన బుధవారం జూనియర్స్ విభాగంలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత క్రమ శిక్షణతో సాధన చేయాలని, ఎక్కడ పొరపాటు చేస్తున్నామో గ్రహించి మరోసారి అలాంటి పొరపాటు చేయకుండా చూసుకోవాలని సూచించారు. క్రీడల్లో దేశం తరఫున వచ్చే ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పలు రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి
- హకీంపేట్‌లో రూ.45.15 కోట్లతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌కు భూమిపూజ



అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌కు భూమిపూజ చేస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి, తదితరులు

దుద్యాల్: యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మండలంలోని హకీంపేట్‌లో నూతనంగా ఏర్పాటు చేయనున్న అధునాతన సాంకేతిక కేంద్రం(అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్)కు బుధవారం కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం పారిశ్రామిక కేంద్రాల్లో ఎన్నో కొత్త టెక్నాలజీలు అందుబాటులోకి వస్తున్నాయని, వీటిని సులువుగా వినియోగించే అంశాలపై శిక్షణ అందించేందుకు ఇవి ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. పరిస్థితులు అనుకూలించక పదో తరగతి వరకే చదివిన వారు ఏటీసీ కోర్సులలో చేరితే అనేక ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. కొడంగల్ ప్రాంతంలో పరిశ్రమలను నెలకొల్పడం ద్వారా స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు. హకీంపేటలో ఏర్పాటు చేస్తున్న అధునాతన సాంకేతిక కేంద్రం ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. ఒక్కో సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం సుమారు రూ.45.15 కోట్ల వరకు ఖర్చు చేస్తోందని తెలిపారు. ప్రతి కేంద్రంలో దాదాపుగా 240 మంది అడ్మిషన్ పొందవచ్చని, వీరికోసం 6 ట్రేడ్‌లు, 12 యూనిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇందులో డ్రోన్ టెక్నాలజీ, రోబోటిక్ టెక్నాలజీ, అడ్వాన్స్ టెక్నాలజీ వంటి వివిధ కోర్సులు చేయొచ్చని వివరించారు. హకీంపేటలో వచ్చే సంవత్సరం నుంచి అడ్మిషన్లు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని స్పష్టం చేశారు. అన్ని కోర్సులూ ఏఐతో కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఐలు యాదగిరి, సత్యనారాయణ, పంచాయతీరాజ్ డీఈ సత్యనారాయణ, ఏఈ సురేందర్‌రెడ్డి, టీజీ ఐఐసీ జోనల్ మేనేజర్ కవిత, అదనపు జోనల్ మేనేజర్ శేషగిరిరావు, ప్రాజెక్ట్ ఇంజనీర్ విక్రమ్, తహసీల్దార్ కిషన్, ఎంపీడీవో మహేశ్ కుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు

మంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. లగచర్ల దాడి ఘటనను దృష్టిలో ఉంచుకుని, ముందస్తు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా రోటిబండ తండా, లగచర్ల గేట్‌తో పాటు ప్రతి గ్రామం వద్ద ప్రత్యేక బలగాలను మోహరించారు. పరిగి డీఎస్పీ శ్రీనివాస్ బందోబస్తును పర్యవేక్షించారు.

ఆసరా.. అంతేనా!

- జాడలేని కొత్త పింఛన్లు
- అర్హుల ఎదురుచూపులు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు



కేశంపేట: ఆసరా పింఛన్లు కొత్తగా మంజూరు కాకపోవడంతో అర్హులైనవారు ఆశగా ఎదురుచూస్తున్నారు. నాయకులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వరకు అర్హులకు నూతనంగా పెన్షన్ మంజూరు చేయలేదు. దీంతో గ్రామాల్లో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు ఆసరా కోసం నిరీక్షిస్తున్నారు.

కార్యాలయాల చుట్టూ చక్కర్లు

వృద్ధాప్యంలో ప్రభుత్వం అందించే ఆసరా పింఛన్ వస్తే భరోసాతో బతకవచ్చని వృద్ధులు భావిస్తున్నారు. అలాగే ఇంటి పెద్దలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వితంతు మహిళలు ఈ సహాయంతో కుటుంబాన్ని పోషించుకోవచ్చని, ఒంటరి మహిళలు ఎవరిపై ఆధారపడకుండా జీవించొచ్చని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మూడేళ్లుగా ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేయడం లేదు. దీంతో అర్హులైన వారు గ్రామ పంచాయతీలు, మండల పరిషత్, కలెక్టరేట్ కార్యాలయానికి వస్తున్నారు.

స్పష్టత కరువు

కొత్త పింఛన్ల మంజూరుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది. గతంలో 57 సంవత్సరాల వయస్సు ఉన్న వారికి వృద్ధాప్య పెన్షన్ మంజూరు కోసం మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించి, విచారణ అనంతరం మంజూరు చేసింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వృద్ధాప్య పెన్షన్ వయస్సు పెంచినట్టు గ్రామాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ చేయూత సైట్‌లో 65 ఏళ్ల వారికి వృద్ధాప్య పింఛన్‌లకు అర్హులుగా కన్పిస్తోంది. దీంతో గ్రామాల్లో 57 ఎళ్లు నిండిన వృద్ధులు అయోమయంలో పడ్డారు. వయస్సు నిర్ధారణపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

కొందరికే అవకాశం

ప్రస్తుతం పింఛన్ల మంజూరుకు కొందరికి మాత్రమే ఉన్నతాధికారులు అవకాశం కల్పించారు. వృద్ధాప్య పెన్షన్ పొందుతున్న వారు మరణిస్తే ఆ స్థానంలో భార్య లేదా భర్తకు అందిస్తున్నారు. వృద్ధాప్య పింఛన్ పొందుతూ దివ్యాంగులైన వారికి వృద్ధాప్య పెన్షన్ నుంచి వికలాంగుల పింఛన్‌కు మారుస్తున్నారు. దివ్యాంగుల పింఛన్ పొందుతూ మరణించిన వారి పింఛన్‌ను వృద్ధాప్య పింఛన్‌కు అధికారులు మార్చడం లేదు.

దరఖాస్తు చేసినా రాలే..



నా భర్త వికలాంగుల పింఛన్ తీసుకుంటూ రెండేళ్ల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి భర్త పింఛన్ మార్చి వితంతు పింఛన్ మంజూరు చేయలని అధికారులు చుట్టూ తిరుగుతున్నాను. ప్రజావాణిలో కలెక్టర్‌కు దరఖాస్తు చేసినా నేటికీ పింఛన్ మంజూరు చేయడం లేదు.

– చిర్ర వెంకటమ్మ, కేశంపేట గ్రామం

ఆదేశాలు రాలేదు



పింఛన్ల కోసం ఎవరైనా దరఖాస్తు ఇస్తే గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు తీసుకుంటారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేస్తాం. కొత్త పింఛన్ల కోసం ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు.

– రవిచంద్రకుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి, ఎంపీడీఓ, కేశంపేట

క్లుప్తంగా

గణేశ్ లడ్డూల చోరీ.. ఇన్‌స్టాలో పోస్ట్!

ఆదిబట్ల పీఎస్‌లో ఏడుగురిపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం రూరల్: మండపాల్లోని గణేశుడి లడ్డూలు చోరీ చేసి, తిన్న ఏడుగురు యువకులపై పోలీసు కేసు నమోదైంది. ఆదిబట్ల ఎస్‌ఐ సైదయ్య కథనం ప్రకారం.. ఉపాధి నిమిత్తం మన్నెగూడ ప్రాంతంలో నివాసం ఉంటున్న సాయితేజ, శివకుమార్ వినాయకుడి లడ్డూలను చోరీ చేసి, తింటే మంచి జరుగుతుందని నమ్మి రాత్రి వేళ మన్నెగూడలోని ఎన్ఎస్ఆర్‌నగర్, మహోనియా ఆస్పత్రి వెనకాల, ఎంఎంకుంట ప్రాంతాల్లోని పలు వినాయక విగ్రహాల చేతుల్లో ఉన్న లడ్డూలను దొంగిలించారు. అబ్బు, ప్రవీణ్, రాహుల్‌తో పాటు మరో ఇద్దరు మైనర్లతో కలిసి లడ్డూలను తినేశారు. అంతటితో ఆగకుండా లడ్డూలు చోరీ చేసిన సమయంలో తీసుకున్న వీడియోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. ఉదయాన్నే లడ్డూలు లేకపోవడాన్ని గమనించిన నిర్వాహకులకు ఇన్‌స్టాలో వీరు షేర్ చేసిన వీడియోలు కనిపించడంతో, నిందితులను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్లు సీజ్



పోలీసులు సీజ్ చేసిన టిప్పర్లు

ఇబ్రహీంపట్నంరూరల్: ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న నాలుగు టిప్పర్లను పోలీసులు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ రవికుమార్ కథనం ప్రకారం.. రావిర్యాల, నాదర్‌గుల్ ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశారు. నాలుగు టిప్పర్లను స్వాధీనం చేసు కొని సీజ్ చేశారు. అనంతరం కేసు నమోదు చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

సనత్‌నగర్: నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న ఓ మహిళ మెడలోని 1.5 తులాల బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.సనత్‌నగర్ ఎస్సార్టీకాలనీకి చెందిన కడారి రమాదేవి ఈ నెల 1న సాయంత్రం స్థానిక నెహ్రూ పార్కు సమీపంలోని గణేష్ మండపానికి వచ్చింది. రాత్రి ఇంటికి తిరిగి వెళుతుండగా సాయిబాబా ఆలయ సమీపంలో బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోని 1.5 తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలు సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బైక్‌పై వచ్చిన వ్యక్తి స్కైబ్లూ కలర్ జర్కిన్ ధరించినట్లు బాధితురాలు పేర్కొంది.

బైక్ అదుపుతప్పి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

హస్తినాపురం: బైక్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్రంగా గాయపడిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక హైకోర్టు కాలనీకి చెందిన దుర్గంపూడి అంజిరెడ్డి(43) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి అతను బైక్‌పై వెళుతుండగా పనామాచౌరస్తా సమీపంలోని మాక్స్‌విజన్ ఐ ఆసుపత్రి వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని గుర్తించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ అంజిరెడ్డిని వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి సోదరుడు గోపాలకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వనస్థలిపురం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

సిబ్బంది కొరత!



తాండూరు తహసీల్దార్ కార్యాలయం

- సెలవుపై వెళ్లిన తాండూరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్
- ఇప్పటికే ప్రమోషన్‌పై సీనియర్ అసిస్టెంట్
- తహసీల్దార్ కార్యాలయంలో పేరుకుపోయిన దరఖాస్తులు

తాండూరు రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత నెలకొంది. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. మండలంలో 33 గ్రామాలు, తాండూరు పట్టణంలో 36 వార్డులున్నాయి. తహసీల్దార్ కార్యాలయానికి రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం నిత్యం వందల సంఖ్యలో దరఖాస్తులు వస్తుంటాయి. ప్రస్తుతం తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఒక ఆర్ఐ, సర్వేయర్, ముగ్గురు రికార్డు అసిస్టెంట్లు, ఒక కంప్యూటర్ ఆపరేటర్, ఒక ధరణి ఆపరేటర్‌లు విధులు నిర్వహిస్తున్నారు. పది రోజుల క్రితం కార్యాలయంలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ప్రదీప్‌కుమార్ డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతి పొందిచ బదిలీపై వెళ్లారు. తాజాగా కార్యాలయంలో పని చేస్తున్న ఆర్ఐ(గిర్దవారు) గోపిపై అవినీతి ఆరోపణలు రావడంతో సెలవుపై వెళ్లినట్లు సమాచారం.

ఆర్ఐ పోస్టు ఖాళీ

పట్టణానికి చెందిన ఓ వ్యక్తి రేషన్‌కార్డు జారీలో ఆర్ఐ గోపి అవినీతికి పాల్పడుతున్నట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆర్ఐ మనస్తాపం చెంది సెలవులో ఉండి మరో మండలానికి బదిలీ చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సీనియర్ అసిస్టెంట్ పోస్టుతో పాటు రెండు ఆర్ఐ పోస్టుల్లో ఒకటి ఖాళీగా ఉంది. తాజాగా ఆర్ఐ గోపి కూడా బదిలీకి ప్రయత్నాలు చేయడంతో ఆ పోస్టు సైతం ఖాళీ అయ్యే అవకాశం ఉన్నట్లు సిబ్బంది చెబుతున్నారు. దీంతో కార్యాలయంలో సిబ్బంది కొరత ఏర్పడనుంది. ఇక సర్వేయర్ కూడా ప్రజలకు అందుబాటులో ఉండటం లేదనే ఆరోపణలున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందిని భర్తీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తాండూరుపై ఏసీబీ నజర్

కొన్నిరోజుల క్రితం తాండూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఓ అధికారి రూ.15 వేలు లంచం తీసుకుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్న విషయం తెలిసిందే. అధికారులను పట్టించిన బాధితుడు ఓ వీడియో సందేశం కూడా విడుదల చేశాడు. తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి పెరిగిపోయిందని ఆరోపించారు. దీంతో ఏసీబీ అధికారులు ఇక్కడ దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

> **సమస్యలు పరిష్కరిస్తాం**
>
> తహసీల్దార్ కార్యాలయంలో ఇద్దరు ఆర్ఐలు ఉండాలి. ప్రస్తుతం ఒక ఆర్ఐ, ఒక సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండలంతో పాటు పట్టణం నుంచి పెద్ద ఎత్తున రెవెన్యూ దరఖాస్తులు వస్తాయి. ఆర్ఐ గోపికి ఒక్క రోజు మాత్రమే సెలవు ఇచ్చాం. సమస్యలను ప్రస్తుత సిబ్బందితో కలిసి పరిష్కారిస్తాం.
>
> – తారాసింగ్, తహసీల్దార్, తాండూరు

కేంద్ర విధానాలతో రైతులకు నష్టం

రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

కొడంగల్ రూరల్: కేంద్ర ప్రభుత్వ విధానాలు పత్తి రైతుల జీవనోపాధిని దెబ్బ తీసేవిధంగా ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేష్‌కుమార్ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పత్తి రైతులకు సముచిత స్థానం కల్పిస్తూ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్స్ మేరకు ఖర్చు సూత్రాన్ని ఉపయోగించి క్వింటాకు రూ.10,075 మద్దతు ధరను ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులకు అనుకూలంగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పునర్నిర్మాణం చేపడుతూ తగినన్ని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.25లక్షల పరిహారం, పిల్లలకు పూర్తి స్థాయిలో విద్య, కుటుంబంలోని వారికి జీవనోపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆత్మహత్యల నివారణ కోసం పంట రుణాలు, వ్యవసాయ పరికరాల రుణాలు, యంత్ర రుణాలను ఇవ్వాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం తహసీల్దార్ దీపక్ శ్యామ్‌ధన్‌దాస్‌కు అందించారు. కార్యక్రమంలో నాయకులు బాబ్యానాయక్, శంకర్‌నాయక్, లోక్యనాయక్, మోహన్‌నాయక్, జైపాల్, శివకుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌పై యువకుల దాడి

రహమత్‌నగర్: గణేశ్ నిమజ్జన యాత్ర సందర్భంగా హెడ్ కానిస్టేబుల్‌పై యువకులు దాడి చేసిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మంగళవారం రాత్రి ఈఎస్ఐ విజయలక్ష్మీ ఆలయం వద్ద వినాయక విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళుతున్నాయి. ఆ సమయంలో ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ యువకులు గొడవ చేస్తుండటాన్ని తన సెల్ ఫోన్‌లో రికార్డు చేసేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆగ్రహానికి లోనైన వారు హెడ్ కానిస్టేబుల్‌పై దాడి చేశారు. రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన బోరబండ పోలీసులు గణేశ్ మండప నిర్వాహకులకు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

సీపీఐ జిల్లా కమిటీ మెంబర్ గోపాల్‌రెడ్డి



వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

పరిగి: అధిక వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.30వేలు పరిహారం అందించాలని సీపీఐ జిల్లా కమిటీ మెంబర్ గోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని ఆయ గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పంట నష్టాన్ని అంచనా వేయడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఈ సంవత్సరంలో పంట నష్టం చాలా అయిందన్నారు. ఇప్పటివరకు వ్యవసాయ అధికారులు నష్టపరిహారం అంచనా వేయకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ఆరుగాలం కష్టపడితే కానీ పంట చేతికి రాదని అకాల వర్షాలతో ఎంతో మంది రైతులు తీవ్ర నష్టాల పాలయ్యారన్నారు. ప్రభుత్వం ఎకరానికి రూ.30వేలు పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేష్, రాంచంద్రయ్య, యాదయ్య, నజీర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధికి కృషి

కాంగ్రెస్ పార్టీ కొడంగల్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి



దుద్యాల్: లగచర్లలో డబుల్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న తిరుపతిరెడ్డి

దుద్యాల్: గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని గౌరారంలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన మోడల్ అంగన్‌వాడీ భవన ప్రారంభోత్సవం, తుంకిమెట్ల–కోస్గి పీడబ్ల్యూ రోడ్డు నుంచి లగచర్ల గ్రామానికి రూ.2.80 కోట్లతో నిర్మించే డబుల్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుద్యాల్ మండలంలోని ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేస్తుందన్నారు. జిల్లాలోనే ఆధునిక హంగులతో మొదటి మోడల్ అంగన్‌వాడీ భవనం నిర్మించామని పేర్కొన్నారు. త్వరలోనే ప్రతి గ్రామంలో ఇలాంటి అంగన్‌వాడీ భవనాలను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, పంచాయతీ రాజ్ డీఈ సత్యనారాయణ, ఏఈ సురేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవినాయక్, పంచాయతీ కార్యదర్శులు భరత్, ఆనంద్, నాయకులు అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

బొంరాస్‌పేట: సీఎం రేవంత్‌రెడ్డి కృషితో నియోజకవర్గంలో ఎన్నడు లేని విధంగా అభివృద్ధి పనులు చూస్తున్నామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో రూ.1.60 లక్షలతో అండర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.20 లక్షల నిధులతో నిర్మాణం చేసిన అంగన్‌వాడీ కేంద్రం-1 నూతన భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, టీజీ ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నర్సింలుగౌడ్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, నాయకులు, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించండి

బొంరాస్‌పేట: మండల పరిధిలోని ఎన్కేపల్లి ప్రభుత్వ పాఠశాలలో 130 మంది విద్యార్థులకు ఇద్దరే ఉపాధ్యాయులు ఉన్నారని గ్రామ మహిళా సంఘం ప్రతినిధులు తిరుపతిరెడ్డికి విన్నవించారు. విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో నాయకురాళ్లు మాణెమ్మ, ఏపీసీ చైర్మన్ బసమ్మ, అనంతమ్మ, గ్రామపెద్దలు శేఖర్ తదితరులున్నారు.

ఉరేసుకుని రైతు ఆత్మహత్య

- తాను కొనుగోలు చేసిన భూమిని రిజిస్ట్రేషన్ చేయడం లేదని మనస్తాపం
- బడేంపల్లితండాలో ఘటన
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



రెడ్యానాయక్ (ఫైల్)

దోమ: డబ్బులు చెల్లించి కొనుగోలు చేసిన భూమిని తమ పేరున రిజిస్ట్రేషన్ చేయించడం లేదని మనస్తాపానికి గురైన ఓ రైతు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వసంత్‌జాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. బడేంపల్లితండాకు చెందిన విస్లావత్ రెడ్యానాయక్, మాణిక్‌బాయి దంపతులు 2018లో ఇదే తండాకు చెందిన శేరిబాయి మొగులయ్య వద్ద సర్వేనంబర్ 103అ/6లో 29 గుంటల భూమిని కొనుగోలు చేశారు. అప్పటి నుంచి కాస్తులో ఉంటూ పంటలు సాగు చేస్తున్నారు. కానీ రెడ్యానాయక్ కుటుంబానికి రిజిస్ట్రేషన్ చేయించలేదు. అయితే 2023లో ఇదే భూమిని మొగులయ్య తన కోడలు దేవమ్మ పేరున పట్టా చేయించాడు. అప్పటి నుంచి రెడ్యానాయక్ కుటుంబాన్ని కాస్తులో నుంచి వెళ్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదే విషయమై గత నెల 13న గ్రామస్తుల సమక్షంలో పంచాయితీ పెట్టగా భూమికి బదులు డబ్బులు ఇస్తామని, భూమి జోలికి రావొద్దని మొగులయ్య కుటుంబ సభ్యులు చెప్పగా రెడ్యానాయక్ దంపతులు ఇందుకు అంగీకరించలేదు. ఈక్రమంలో గత నెల 31న బడేంపల్లి గ్రామానికి చెందిన జోగు భాస్కర్ అనే వ్యక్తి తన ట్రాక్టర్‌తో భూమిని చదును చేశాడు. ఈనెల 1న సలీం, శేఖర్, రాజు, రమేశ్, నరేశ్, శివ అనే వ్యక్తులతో వచ్చి చదును చేసిన భూమిలో కడీలు పాతించేందుకు ప్రయత్నించాడు. రెడ్యానాయక్ కుటుంబం అడ్డుపడగా బెదిరింపులకు గురిచేసి, దాడికి ప్రయత్నించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన రెడ్యానాయక్(58) మంగళవారం బయటకు వెళ్తున్నానని చెప్పి పొలం వద్దకు వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టు పక్క రైతులు ఇది గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే అతను చనిపోయాడు. మృతుడి కుమారుడు మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు



ప్రవీణ్‌నాథ్ (ఫైల్)

పహాడీషరీఫ్: మేనమామ మందలించడంతో బాలుడు ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన దుర్గానాథ్ కొన్నేళ్ల క్రితం జల్‌పల్లికి జీవనోపాధి నిమిత్తం వలస వచ్చాడు. తల్లిదండ్రులు లేని అతని మేనల్లుడు ప్రవీణ్‌నాథ్(12) ఇతని వద్దే ఉంటాడు. తరచూ అల్లరి చేసే ప్రవీణ్‌ను మేనమామ గత నెల 31వ తేదీన రాత్రి మందలించాడు. ఉదయం లేచి చూసేసరికి కనిపించలేదు. అతని ఆచూకీ కోసం స్థానికంగా గాలించినా ఫలితం లేకుండా పోయింది. ఈ విషయమై మంగళవారం రాత్రి దుర్గానాథ్ పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో గాని సమాచారం అందించాలని కోరారు.

పాతిపెట్టిన శవానికి పోస్టుమార్టం

మృతిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు



తహసీల్దార్ సమక్షంలో పోస్టుమార్టం నిర్వహిస్తున్న వైద్యులు

పూడూరు: పాతిపెట్టిన శవానికి పోస్టుమార్టం చేసిన సంఘటన బుధవారం చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ భరత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని దేవనోనిగూడకు చెందిన మహమ్మద్ జాఫర్ తన కుమారుడు మహమ్మద్ గౌస్‌పాషా(27) మృతిపై అనుమానం ఉందని ఈ నెల 1న ఫిర్యాదు చేశాడు. పరిగి మున్సిపల్‌కు చెందిన తయ్యబాతో గౌస్‌పాషాకు అయిదేళ్ల క్రితం వివాహం అయింది. వీరికి రెండేళ్ల పాప ఉంది. కుటుంబ కలహాలతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో గత నెల 22న గౌస్‌పాషా గడ్డి మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడని తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గత నెల 28న మృతి చెందగా, అదే రోజు ఖననం చేశారు. కోడలు తయ్యబాపై అనుమానం వచ్చిన కుటుంబీకులు నిలదీయడంతో గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుందని బయటపడింది. తయ్యబా ఫోన్‌ను పరిశీలించగా ప్రియుడితో మాట్లాడిన వీడియోలు బహిర్గతమయ్యాయి. ఇద్దరి వేధింపుల కారణంగానే తమ కుమారుడు మృతి చెందినట్లు కుటుంబీకులు అనుమానించారు. ఈ మేరకు మృతుని తండ్రి మమ్మద్‌జాఫర్ చన్గోముల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చన్గోముల్ ఎస్‌ఐ భరత్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్ సమక్షంలో పాతిపెట్టిన శవానికి పంచనామా చేసి పోస్టుమార్టం నిర్వహించారు.

ఆలయ భూమిలో రోడ్డు లేదు

ఇబ్రహీంపట్నం రూరల్: బీరప్ప దేవాలయం భూమిలో రోడ్డు లేదని, ప్రహరీ నిర్మాణం చేయడానికి అనుమతి ఇవ్వాలని ఆ ఆలయ కమిటీ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 31లో 1.10 ఎకరాల విస్తీర్ణం భూమి 1995లో ఆలయానికి కొనుగోలు చేశామని తెలిపారు. అనంతరం చుట్టూ ప్రహరీ నిర్మించామన్నారు. కానీ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా హైడ్రా అధికారులు కూల్చి వేశారని, అలా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆ భూమిలో మరలా ప్రహరీ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోరే జంగయ్య, బండ రాజు, బీరప్ప, బాలం భాస్కర్, యాదగిరి, శివకుమార్, ఐలయ్య, సతీష్, రవి, భిక్షపతి, మల్లేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళ వద్ద గంజాయి పట్టివేత...!

శంషాబాద్: మహిళా ప్రయాణికురాలి వద్ద భారీ ఎత్తున గంజాయి పట్టుబడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి... ఈ నెల 1న రాత్రి ఇండిగో విమానంలో బ్యాంకాక్ నుంచి వచ్చిన మహిళా ప్రయాణికురాలి కదలికలను అనుమానించిన అధికారులు ఆమె లగేజీని తనిఖీ చేయగా అందులో గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ దాదాపు రూ.3 కోట్లు ఉండవచ్చునని అధికారులు అంచనా వేసినట్లు సమాచారం. అయితే గంజాయి పట్టివేతపై సంబంధిత వర్గాలు అధికారికంగా ఎలాంటి సమాచారాన్ని వెల్లడించకపోవడం గమనార్హం.

గంజాయి విక్రయిస్తున్న వృద్ధురాలి అరెస్టు..

సనత్‌నగర్: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న వృద్ధురాలిని సనత్‌నగర పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..ఫతేనగర్ ఎల్‌బీఎస్‌నగర్‌లోని ఓ ఇంట్లో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి విక్రయిస్తున్న షేక్ జబీన్ బీ (70) అనే వృద్ధురాలు గంజాయి విక్రయిస్తున్నట్లుగా గుర్తించి, ఆమె ఇంట్లో సోదా చేయగా 430 గ్రాముల గంజాయి లభ్యమైంది. ధూల్‌పేట్ నుంచి గంజాయిని తీసుకువచ్చి చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణతో వెల్లడైంది. నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అడ్డదిడ్డంగా లారీల పార్కింగ్

- తాండూరు– చించోళి ప్రధాన రహదారికి ఇరువైపులా నిలిపివేత
- తరచూ ప్రమాదాలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు



గౌతాపూర్ మార్గంలో నిలిపిన లారీలు

తాండూరు రూరల్: పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన తాండూరులో లారీ పార్కింగ్‌కు సరైన స్థలం లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఇక్కడి నుంచి దేశం నలుమూలలకు సిమెంట్, నాపరాతిని తరలిస్తుంటారు. పట్టణంలో సుమారు 500 పైగా లారీలున్నాయి. వీటికి ప్రత్యేకమైన పార్కింగ్ స్థలం లేకపోవడంతో యజమానులు, డ్రైవర్లు ఎక్కడ పడితే అక్కడ నిలుపుతున్నారు. ట్రాన్స్‌పోర్టుల వద్ద గంటల తరబడి నిలబెడుతున్నారు. రోడ్లకు ఇరువైపులా లారీలను పార్క్ చేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తాండూరు మండలంలోని కరన్‌కోట్ శివారులో సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ), బెల్కటూర్ వద్ద(అదానీ సిమెంట్), మల్కాపూర్ వద్ద కూడా పలు సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. దీనికి తోడు కర్ణాటక సరిహద్దులోనూ సాగర్, చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీలున్నాయి. వీటి నుంచి నిత్యం లారీల్లో వివిధ ప్రాంతాలకు సిమెంట్ తరలిస్తుంటారు. పట్టణంలో వివిధ కంపెనీలకు చెందిన వందలాది ట్రాన్స్‌పోర్టులు ఉన్నాయి. సిమెంట్ తరలించే క్రమంలో తాండూరు నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లాలి. దీంతో పట్టణంలోని వివిధ ట్రాన్స్‌పోర్టుల వద్ద వాహనాలను నిలుపుతున్నారు. ముఖ్యంగా తాండూరు– చించోళి ప్రధాన మార్గం చంద్ర థియేటర్ వద్ద నుంచి గౌతపూర్ చెక్‌పోస్టు వద్దకు రోడ్డుకిరువైపులా లారీలను పార్క్ చేస్తున్నారు. రోడ్డు మధ్యలో లారీని నిలిపి రివర్స్ తీసుకునే సమయంలో యాక్సిడెంట్లు చోటుచేసుకుంటున్నాయి.

గనులు, పాలిషింగ్ యూనిట్లు..

తాండూరు ప్రాంతంలో వందల సంఖ్యలో నాపరాతి గనులు, పాలిషింగ్ యూనిట్లు ఉన్నాయి. నాపరాతి గనుల నుంచి బండరాళ్లను వివిధ ప్రాంతాలకు లారీల్లో తరలిస్తుంటారు. ముఖ్యంగా తాండూరులోని గౌతపూర్‌రోడ్డు, అంతారం, కోకట్, లక్ష్మీనారాయణపూర్, చెన్‌గేస్‌పూర్ మార్గంలో పాలిషింగ్ యూనిట్లు ఉన్నాయి. వీటి నుంచి లారీల్లో బండలు తరలిస్తారు. పాలిషింగ్ యూనిట్ల వద్ద సైతం లారీలను ఇష్టారాజ్యంగా పార్క్ చేస్తున్నారు.

పోలీసులు ప్రేక్షక పాత్ర

లారీల పార్కింగ్‌ను పోలీసులు పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ రూట్‌లో నిత్యం అనేక సార్లు ప్రయాణిస్తున్నా ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని మండిపడుతున్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో హడావుడి చేయడం కన్నా వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సరిపడా యూరియా ఇవ్వండి

సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య



నిరసన వ్యక్తం చేస్తున్న యాదయ్య తదితరులు

మంచాల: రైతులకు సరిపడా యూరియా అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు రాజ్యమని గొప్పలు చెప్పుకొని ప్రభుత్వాలు వారి బాధలను పట్టించుకోవడం లేదన్నారు. రైతాంగ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాగుడు మూతలు ఆడడం సరైంది కాదన్నారు. యూరియా అందించి అండగా నిలవాలన్నారు. వర్షాకాలం రైతాంగం పంటలు సాగు చేసే సమయంలో కొరత విధించడం ఎంత వరకు సమంజసం కాదన్నారు. వ్యవసాయ పనులు మానేసి రైతులు యూరియా కోసం రోజుల తరబడి క్యూలో నిరీక్షించడం దారుణన్నారు. ఇప్పటికైనా యూరియా నిల్వలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జంగయ్య, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, యాదయ్య, జంగయ్య, లెనిన్, ఐలయ్య, వినోద్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.